

భక్తి, జ్ఞాన, వైరాగ్యాల నవ ఉషస్సు..
మహాశీస్సు
ఆరాధనోత్సవ సంచిక



## శ్రీ బాబూజీ - అస్యూరెన్స్


హ్యాపీగా బాబాను పట్టుకోండి, చక్కగా బాబాను చూపించాను, బాబా తత్వమేమిటో చెప్పాను, పట్టుకోండి. మిమ్మల్ని, ఎలా తీసుకుపోవాలో నాకు తెలుసు. చక్కగా ఉండండి. మీకేమీ లోటు రాదు. నేను చెపుతున్నాను కదా. ఆ అస్యూరెన్స్ కూడా నేను ఇస్తున్నా మీకెందుకు. చక్కగా బాబామీద ఫోకస్ చేయండంతే. ఆ అస్యూరెన్స్ మీరు నాకివ్వాలి. బాబా, బాబా, బాబా. అంతే వేరే ఏదీ ఉండకూడదు, మనసులో. లైఫ్ అంతా కూడాను, మన జీవితంలో బాబాయొక్క సత్సంగము అనేటటువంటిది ఒక భాగం కావటం కాదు. ఆయనయొక్క లీలా ప్రబోధానికి మన జీవితమే ఒక భాగం కావాలి. అలా ప్రయత్నం చేయండి. బాబా చూసుకుంటారు.

సంపుటి : 27
సంచిక : 5

ఆరాధనోత్సవ సంచిక
13 నవంబర్ 2024



గురుకృప






# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



పథగామి 4
- గురుకృప

ధర్మాచరణకు నావ ....... 7
- గురుకృప

సజీవ దర్పణం-సద్గురువు 9
- గురుకృప

నిత్య సమాధానం 10
- గురుకృప

12 భక్తుల సందేహాలు .....
-శ్రీబాబూజీ అనుగ్రహభాషణాల నుండి

16 ఇదీ కథ
- గురుకృప

23 గురుకృపాలహరి
- గురుకృప

28 నన్నే తప్పిద్దామనా!
- 'సరసాల్లో నవరసాలు' నుండి

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info




# పథగామి

## ఓర్పు కావాలి... ఒడుపు తెలియాలి

ఆశయం విత్తనంలాంటిది. ఆ విత్తనం మొలకెత్తడానికి తగిన వాతావరణం కావాలి. ప్రదేశాన్ని పాదుగా రూపొందించకుండా విత్తనం మొలకెత్తదు కదా! ఆశయం కలిగిన వారికి ఓర్పు కావాలి. ఒడుపు (నేర్పు, కిటుకు, పట్టు) తెలియాలి. పట్టు విడుపులుండాలి (ఎక్కడ తగ్గాలో, ఎక్కడ ఎదగాలో). ఆ ఆశయాన్ని ఒక మహాకార్యక్రమంగా పాదుకొలుప గలిగిన దీక్ష ఉండాలి. మానవజాతిని తమస్సు నుండి ఈవలకు ఆహ్వానించగలిగిన **'తపస్సు'** జరగాలి. సూర్యుని నుండి వెలువడుతున్న కిరణాలు ఎలాంటివో సద్గ్రంథాలు అలాంటివి. పెద్దవాళ్ళ (మహాత్ముల) పుస్తకాలు (సద్గ్రంథాలు) చదివితే మనను గూర్చి మనకు బాగా తెలుస్తుంది. మనమేం చేయాలో మనకు బోధపడుతుంది. కనుక అట్లాంటి పుస్తకాలు అవకాశమున్నపుడల్లా చదవడం ఎంతైనా అవసరం. **15 సంవత్సరాల నుండి 25 సం॥ల** లోపులోనే మన మనస్సు, మన జీవితం మనం చెప్పినట్లు వింటాయి. సరైన పద్ధతిలో మనను మనం మలచుకోవలసిన కాలమది. ఈ వయస్సులో మనను మనం మలుచుకోవడం మీదనే మిగిలిన జీవితం ఆధారపడి ఉంటుంది.

మనకు వచ్చే ప్రతి ఆలోచననీ, మనం మాట్లాడే ప్రతి మాటని, మనం చేసే ప్రతి పనిని ఆయన శ్రద్ధగా గమనిస్తూ కావలసిన సర్దుబాట్లు చెప్పేవారు. చేయవలసిన దిద్దుబాట్లు చేసేవారు. ఆ సర్దుబాట్లు, దిద్దుబాట్లు మరచిపోలేనివిగా ఉండేవి. అవే లీలలు యవ్వనంలో మనం తీసుకున్న నిర్ణయాల మీదా, నేర్చుకున్న సత్యాలమీదా, అభ్యసించిన సత్ప్రవర్తన మీదా మిగిలిన జీవితమంతా ఆధారపడి ఉంటుంది. అందువలననే ఈ వయస్సులో సత్పురుషులతో, సద్గ్రంథములతో సంబంధం పెట్టుకొని మిలటరీ వారివలే దీక్షగా మనని మనం తీర్చిదిద్దుకోవలసి ఉంది. లేకపోతే యవ్వన వేగం మరో వైపుకి లాగి జీవితాన్ని మసక బార్చగలదు. మన అదృష్టం వల్ల మనకు సరైన వయసులో మహాత్ముల సాంగత్యం కలిగింది. జీవితాన్ని తీర్చిదిద్దుకునే అవకాశం, అందుకు కావలసిన సందేశం మనకు సిద్ధంగా ఉంది. మీరు చేయవలసింది చెబుతూ, మీరు నేర్వవలసింది నేర్చుకునేలా, మీరు




నేర్చుకునేవరకు ఓర్పు, ఓడుపులతో ఉంటాం అంటారు గురువులు. **(నేనేది బోధించను - నేర్చుకునేలా చేస్తాను - శ్రీబాబూజీ)** ఇది వారి ప్రేమ. కర్తవ్యోన్ముఖులై కాలాన్ని సద్వినియోగం చేయదలచిన వారు, సరిదారిని చేరేటందుకు ఆర్తితో ఎదురుతెన్నులు చూస్తున్న వారు ఈ లీలలలోని బోధను గ్రహించి, అనుగుణంగా వర్తించగలుగుతారు.

**మనిషన్నవాడు 'మార్పు' కోరకుండానూ ఉండడు. 'మార'కుండానూ ఉండడు.** అలాగే తానంటే ఏమిటో, తన వెనుక ఏమిటో తెలుసుకోవాలని అనుకోకుండానూ ఉండడు, అనుకున్న తరువాత ఇక తెలుసుకోకుండానూ ఉండడు. తెలుసుకున్న తరువాత దానికి తగినట్లుగా వర్తించకుండానూ ఉండడు. ప్రకృతి పరిణామ శీలమైంది కదా! మనమందరమూ కూడా ఆ పరిణామంతో శ్రుతి కలుపవలసిన వారమే కదా!

ఒకటి మాత్రం సత్యం. మనకు తెలిసినా, తెలియక పోయినా మన ప్రయాణం మాత్రం ప్రకృతికి అనుగుణంగానే సాగుతుంది. ఆ సాగుతున్న ప్రయాణానికి ఊతమిచ్చేందుకే గురుని మహిమలు. క్రమంగా ఆవేదన ఆర్తిగా రూపొందుతుంది. ఆర్తి తనకు కావలసిన శక్తిని సంతరించుకుంటుంది. శక్తిమంతమై సమాజ పరిస్థితులను సర్దుకొనేట్లుగా చేయగలిగిన వాతావరణాన్ని రూపొందించు కొంటుంది. పయనించే వారికి పై నుండి సహకారం ఎప్పుడూ అందుతుంది. (మీరు ఒక అడుగు వేస్తే నేను పది అడుగులు వేస్తాను –శ్రీసాయి)

ఇపుడు సమాజంలో మంచి ఆశయాలు కలవారు లేకపోలేదు. అయితే ఆ ఆశయాలు కలవారిలో వాటి సాధనకు కావలసిన వాతావరణాన్ని రూపొందించుకుంటున్నవారు అరుదవుతున్నారు. Create your own environment in order to pursue the path - Sri Babuji. కావలసిన విధంగా జాతిని జాగృతం చేయడానికి వ్యక్తమవుతున్న ఈ దివ్యలీలాకిరణాలకు అందరితో పాటుగా మనమూ అంజలి ఘటిద్దాం, అర్ఘ్యాన్ని అర్పిద్దాం. మహనీయులతో కలిసి జీవిత ప్రయాణాన్ని నడిపే అవకాశం లభించడం ఒక గొప్ప అదృష్టం, ఒక మంచి అవకాశం. అందుకే మన పెద్దలు మహాత్ముల ఆశ్రయం లభించడం అనేది ఒక అరుదైన అదృష్టంగా భావించారు. అలాంటి అదృష్టం మన జీవితాలకు లభించడం పరమగురువుల అనుగ్రహానికి పాత్రులం కావడం మన పూర్వపుణ్య శేషం వల్ల జరిగింది అనడం కన్నా తరతమ బేధాలు ఎరుగని పెద్దల కరుణాకటాక్ష వీక్షణాల వల్ల జరిగినది




అన్నది సత్యం. మానవ జీవితంలోని అన్ని సంబంధ బాంధవ్యాలలో సద్గురువుతో ఉండే అనుబంధం ప్రత్యేకమైనది. ఈ సంబంధానికి హేతువుని ఆపాదించడం, కారణాలు అన్వేషించడం సాధ్యం కాదు. అందుకే శ్రీసాయి తనదైన శైలిలో “నా భక్తులను నేనే ఎన్నుకుంటాను. వారికి, నాకు మధ్య ఋణానుబంధం ఉంది” అన్నారు. భక్తునికి అవసరం కలిగించడం నుండి వారిని తమ సన్నిధిని చేర్చుకునే వరకు జరిగే సంఘటనలన్నీ నిర్హేతుకమైన సద్గురు ప్రేమకు నిదర్శనం అంటారు శ్రీబాబూజీ.

**తర్వాత ఎలా? :** గురువే ఈ సన్నివేశాల నుండి మనలను తెప్పరిల్ల చేయగలవారు, కావలసిన ఓదార్పును అనుగ్రహించగలవారు కూడా వారే! భౌతికదేహం విడవడం అనేది ఎవరి విషయంలోనైనా సహజమే! కానీ గురువుగారు అకాలంగా, అర్థాంతరంగా దేహం విడిచిపెట్టినట్లు అనిపించడంతో సన్నివేశానికి సిద్ధంగా లేని మన మనస్సులు మరిగిపోతున్నాయి. **ఆయన** తర్వాత ఎలా అనడానికి, **ఆయన లేకపోతే కదా!** ఇది వరకు దేహంలో ఉన్నారు. ఇపుడు దేహం లేకుండా ఉన్నారు. అప్పుడెలా అందరిచేతా పని చేయించారో ఇప్పుడంతకంటే ఎక్కువ చేయిస్తారు. ఆయన కార్యక్రమం విజృంభిస్తుందే తప్ప నీరసించదు. ఆ కార్యక్రమంలో ఎవరి పాత్ర ఏమిటి? అనేది ఆయనే నిర్ణయిస్తారు, ఇదివరకటిలాగానే, కాకపోతే మనకు విశేషమయిన సాధన అవసరం. గురువుగారిని కళ్ళతో చూడటానికి అలవాటుపడ్డ మనం ఇపుడు మనస్సుతో స్పర్శగా, స్ఫురణగా అనుభవించడం అభ్యాసం చేయాలి. మనకు చెబుతానన్న ప్రణాళికలన్నీ మనకు చెప్పబడతాయి. ఇన్ని శరీరాలను చేరదీసిన ఆయన ఏ శరీరంతో మనతో మాట్లాడదలుచుకున్నారో ఆ శరీరం ద్వారా చెప్పబడతాయి. కాలమే కలుపుతుంది.

**ఒక ప్రారంభం :** గురువుగారి దివ్యసాన్నిధ్యం నిరంతరం అనుభవిస్తూ ముందుకు సాగుదాం. భౌతికమైన సాహచర్యం ఆ సాన్నిధ్యాన్ని అనుభవించడానికి ఒక ప్రారంభం మాత్రమే! ఇదివరలో కూడా మనం పెరిగినది ఆయన స్మరణలో, ఆయన సాన్నిధ్యంలో మాత్రమే. **సమర్పణ లేనిదే స్మరణ జరగదు. స్మరణ జరగనిదే స్ఫురణ లేదు. స్ఫురణ లేనిదే సాన్నిధ్యం లభించదు.** సమర్పణ లేని భౌతిక సాహచర్యము వలన ప్రయోజనమేమి? మనందరం ఇన్ని చోట్లుగా ఉన్నది గురువుగారి ప్రేమని, కృషిని అన్ని వైపులా పంచడానికి! మిషనరీ జీల్ (నిస్వార్థసేవ, ఉపకారబుద్ధి, ధృఢభక్తి)తో ఈ పని చేయగలగాలి.

**– గురుకృప**




# ధర్మాచరణకు నావ - దినచర్యే సరైన త్రోవ

దినచర్యలో క్రమబద్ధతను కోరి పాటించుట ఒక్కటే మనస్సు మన స్వాధీనమగుటకు మార్గము. యోగాభ్యాసమున మన పెద్దలు చెప్పిన యమనియమాల సారాంశమిదే! కనుక దినచర్యను క్రమబద్ధము చేసుకొనుటలో శ్రద్ధ పెట్టవలయును. దినచర్యను మనము శ్రద్ధగా గమనించగలిగినచో అందులో రెండు భాగములున్నట్లు మనకు తెలియగలవు. మొదటి భాగము మనము మన శరీరమునకు చేసి పెట్టవలసిన పనులు. రెండవ భాగము ఆ శరీరముతో లోకమునకు చేసి పెట్టవలసిన పనులు. ఈ రెండు విభాగములను సమతూకమున నడుపుకొనుట మనిషికి చేత కావలసి ఉన్నది. శరీరమునకు కావలసిన పనులకే ప్రాధాన్యమిచ్చినచో మనము ఈ లోకమునకు దిగి వచ్చినందుకు అర్థము లేకుండా పోవును. శరీరముతో లోకమునకు చేసి పెట్టవలసిన పనులకే ప్రాధాన్యమిచ్చినచో శరీరము నిర్లక్ష్యము చేయబడి ఆ పనులను చేసి పెట్టుటకు సహకరించలేని దుర్భలస్థితికి దిగజారిపోవును. కనుకనే ఈ రెండు విభాగములను సమతూకమున నడుపుకొనుటలో మనము కౌశలము చూపవలయును. ఈ సమతూకము సిద్ధించుటకు కావలసిన అంశములే యమనియమములను యోగాంశములుగా మన పెద్దల చేత ఉపదేశించబడినవి.

కనుక మనము దినచర్యను శ్రద్ధతో గమనించి ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుకోవలసి ఉన్నది. మనము నేర్వవలసినది ఒక్కటే. అది ఏమనగా మనను మనము గమనించుచుండుట. గమనించుట ప్రారంభించితిమనగా మనలో యోగసాధన ప్రారంభమయిందన్నమాట. గమనికకు వచ్చిన అంశములను సరిజూచుకొనుట మొదలిడిన కొలది యోగమార్గమున మన ప్రయాణము వేగముగా సాగగలదు. నీలో నిన్ను నీవు గమనించుకొనుట ప్రారంభమయితే క్రమముగా నీ జీవితము చక్కబడి ఎందరికో అందని ప్రశాంతత సులభముగా నీకు చిక్కుతుంది. ఈ అందిన ప్రశాంతతను ఊతముగా తీసికొని నిన్ను నీవు గమనించుటను మరింత శ్రద్ధగా కొనసాగించుచుండవలయును. ఇహపరములను సాధించుకొనుటలో చాకచక్యము చూపి వర్థిల్లగలవు.

**అశ్రద్ధ చేయవద్దు :**




**'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం'** అన్నారు. మనం ఆచరించవలసిన ధర్మాచరణకి మూలమైనది శరీరమే కదా! కనుకనే **'ఆరోగ్యమే మహాభాగ్యం'** అన్నారు. మహాభాగ్యం అని ఎందుకన్నారంటే, ఈ మహాభాగ్యం లేకపోతే ఏ భాగ్యమూ మనకు వినియోగపడలేదు. కనుక! ఆధ్యాత్మికత పేరిట ఆరోగ్య విషయం అశ్రద్ధ చేయకూడదు. తుపాకిని సరి చూసుకోకుండా దేశ రక్షణను గురించి కలగంటున్న సైనికుడు దేశాన్ని ఎంత రక్షించగలడో, శరీర ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఆధ్యాత్మికత పేరిట ఆశయాలను వల్లించిన వాడు కూడా లోకశ్రేయస్సును అంతే సాధించగలడు. శరీరాన్ని కాపాడుకోవడమే జీవితానికి గమ్యం అనుకుంటారు కొందరు. వారు శరీరానికి పనిచేసి పెట్టగలరు కానీ, శరీరంతో లోకానికి పనిచేయలేరు. శరీరాన్ని అశ్రద్ధ చేయడమే సాధనకు పరమావధి అనుకుంటారు కొందరు. వారు సాధన పేరిట అనుభవించేది వేదనే! ఇంతకూ చేయవలసింది ఏమిటి? శరీరాన్ని కాపాడుకోవడం – జీవితానికి గమ్యంగా కాక, సాధనకు ప్రారంభంగా రూపొందాలి. ప్రస్తుతం నీవు నీ శరీరాన్ని, కుటుంబసభ్యుల శరీరాలను సాధనకు తగిన వేదికలుగా సరిదిద్దుకోవలసి ఉన్నది. కొంచెం శ్రద్ధ పెట్టు. శరీర ఆరోగ్యాన్ని గురించి కూడా అడగవలసి వచ్చిందని బాధపడకండి. సాధనకు తగిన వేదికను అమర్చి ఈయడం కన్నా శిష్యునకు గురువు చేయగలిగినది ఏమున్నది? దూరాన ఉన్నానని బాధపడవద్దు. సూర్యునికీ, పద్మానికీ మధ్య **'దూరం'** అడ్డు పడగలిగిందా? ఒక్కసారి మనసిచ్చుకుంటే చాలు. ఇక అదీ ఎక్కడున్నా విచ్చుకుంటూనే ఉంటుంది. **మనస్సుంది మనం దారిన పడడానికిగాని, దిగులు పడడానికి కాదు.** కనుక దిగులు పడడం మాని, చేయవలసింది చేయాలి. మన పని ఎక్కడ ఉంటుందో మనం అక్కడ ఉంటాం. నీ ద్వారా అక్కడ పని జరగవలసి ఉన్నదన్నమాట. అందుకే **"మీ అవసరం ఎక్కడుంటే అక్కడ మిమ్మల్ని ఉంచుతాను. నా అవసరం ఎక్కడుంటే అక్కడ నేనుంటాను"** అంటారు శ్రీబాబూజీ.

**దివ్యోత్సాహము...**

ఉత్సాహముగా జీవించడమంటే ఏమిటో గురుసన్నిధిలో రుచి చూడగలము. ఉత్సాహంగా జీవించగలగడం కన్నా మోక్షమన్నది ఇంకా వేరుగా ఏమున్నది? అయితే ఆ ఉత్సాహము ఎలా కలుగుతుంది అన్నది ప్రశ్న! నిజమైన ఉత్సాహము మనకు కలగాలి అంటే ముందు మనమెవరమో మనకు తెలియాలి. మనము ఎవరమో మనకు తెలిసినపుడు ఇంక భీతి అన్నది మనకు

కలుగదు. నిరాశ–నిస్పృహలు మన 

జీవనమనే నిఘంటువున ఉండవు. ఫలాపేక్ష అన్నది కలగమన్నా కలగదు. నిర్దేశింపబడిన కార్యక్రమ నిర్వహణలో కావలసిన కౌశలాన్ని నిరంతరం అభ్యసిస్తూ ఉండటంతో నిత్యనూతనమైన ఒకానొక దివ్యానుభూతి కలుగుతూ ఉండగా జీవితం నడిచి పోతూ ఉంటుంది.

ఇక మరొకటి ఉన్నది మనమెవరమో మనకు తెలిసిన వెనుక, ఆ మనకు తగినట్లుగా మన మనస్సునూ, ఇంద్రియాలను, మిగిలిన దేహభాగములను మనము నిరంతరం మలుచుకొనవలసి ఉన్నది. ఈ మలచుకొనుటకు చేయు ప్రయత్నమునే మన పెద్దలు యోగ'సాధన' అని పిలిచినారు.

ఈ యోగసాధన సక్రమముగా సాగుచున్న కొలది మనస్సు కన్నా పై లోకములలో వెల్లివిరియుచున్న ఉత్సాహము దేహపర్యంతము దిగి రాగలదు. ఇట్లు ఆ దివ్యోత్సాహము దిగివచ్చుటనే **అవతరణ**మని మన పెద్దలు పిలిచినారు. అనగా, **ఈ దేహమను భూమిపైన దైవస్వరూపము దివ్యోత్సాహముగా అవతరించినదన్నమాట.** ఆధ్యాత్మిక సాధన పై లోకాల పారవశ్యంలో మునిగిపోవడానికి కాదు. ఆ పై లోకాల నుండి వెలుగును స్వీకరించి క్రింది లోకాలను వెలిగించుకోవడానికి. దినచర్యను వెలిగించుకొని దివ్యంగా, సవ్యంగా నడుపుకోవడానికే దైవప్రార్ధన. నీ దినచర్య క్రమబద్ధం కావడమే నీవు చేసే ప్రార్ధనకు గమ్యం. నీ ప్రార్ధన, నీ ధ్యానం, ఏ స్థితిలో ఉన్నాయో నీ దినచర్య ఇట్టే తెలియచెబుతుంది. అట్టి దివ్యోత్సాహము ఇకపైన అనుక్షణము అనుభవమునకు రాగలదు. మన జన్మ కర్మలు దివ్యములై లోకహితముతో శ్రుతి కలిపి సార్ధకతను పొందగలవు. **ఈ మన పుట్టుక ధన్యము, చరితార్థము, కావలెనని సద్గురువు మనలను ఎంచుకొని చేయిపట్టుకు నడిపించుటయే మహాశీస్సు.**

**– సేకరణ : గురుకృప**

## సజీవ దర్పణం-సద్గురువు

**అద్దం కథ :** ప్రతీరోజు అద్దం తుడుస్తూ కనిపించేవాడు ఒక అయ్య.

ఇది గమనించిన ఒక యువకుడు "తాతయ్యా! ఈ అద్దంలో ఏం కనిపిస్తుంది?" అని అడిగాడు.

"నువ్వు చూస్తే నిన్ను చూపెడుతుంది, నేను చూస్తే నన్ను చూపెడుతుంది!." అన్నారు తాతయ్య.

"అయితే ప్రత్యేకమైన అద్దమైతే కాదుగా మరి ఎందుకు అంత జాగ్రత్త?" అన్నాడు.

"అద్దం నీకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది తెలుసా!" అన్నారు తాతయ్య.

"అవునా అవి ఏంటో చెప్పండి!" అని ఆతృతగా అడిగాడు ఆ యువకుడు.




"నువ్వు అద్దంలోకి చూడగానే నీ ముఖం పైన ఉన్న మరకను ఎంత ఉంటే అంతే చూపెడుతుందిగా?" అన్నారు.

"అవును" అన్నాడు ఆ యువకుడు.

"ఎక్కువగానో తక్కువగానో చూపదుగా?" అన్నారు.

"అవును తాతయ్యా!" అన్నాడు.

"అద్దంలాగ నువ్వు కూడా నీ స్నేహితులకు, నీ తోబుట్టువులకు **'ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలి!'** అని అర్థం. తప్పైతే తప్పని, ఒప్పైతే ఒప్పని, అంతే కానీ ఎక్కువ తక్కువగా ఇంకేదో ఊహించి చెప్పకూడదు!" అన్నారు. ఇది మొదటిపాఠం!

"అద్దం ముందు నువ్వు నిల్చుంటే నిన్ను చూపెడుతుంది! నువ్వు లేకపోతే నిన్ను చూపెట్టదు!

అలాగే ఎవరి గురించైనా మాట్లాడాలి అంటే వారి ముందే మాట్లాడాలి, వారి వెనుక మాట్లాడకూడదు! అని అర్థం". ఇది రెండవ పాఠం అన్నారు.

"అద్దం మన ముఖం పైన ఉన్న మరకను చూపెట్టిందని కోపంతో ఆ అద్దాన్ని పగలకొట్టం కదా, అలాఎవరైనా మన లోపాన్ని మనకు చెప్పినప్పుడు కోపం తెచ్చుకోకుండా, 'మనలోని లోపాన్ని సరిచేసుకోవాలి!' అని చెబుతుంది". ఇది మూడవ పాఠం అన్నారు తాతయ్య. **– సేకరణ : గురుకృప**

## నిత్య సమాధానం - శ్రీసాయి సమాధి స్థానం

అల్లా నాకు కొన్ని పైసలు అప్పగించారు. తిరిగి వాటి లెక్క అప్పచెప్పాలి –శ్రీసాయిబాబా. అది ఆయన కీయబడిన కర్తవ్యం దానిని ఆయన సక్రమంగా, నిశ్శబ్దంగా, గుప్తంగా, గుట్టుగా నిర్వర్తించి వెళ్ళిపోయారు, వెళ్ళిపోయారు అంటే మనలోకి, మన పరిసరాలలోకి అదృశ్యులైనారు. అంతకు ముందు దృశ్యంగా ఉండే "సాయి" అనే ప్రజ్ఞ, ఇపుడు భూగోళం అంతా అదృశ్యంగా, తన యొక్క సూక్ష్మశరీరంతో అందరిలో చైతన్యంగా ఆవరించి ఉన్నది. ఒకసారి చేయిపట్టుకున్నాక, చివరికంటా గమ్యం చేర్చే వరకు విడిచిపెట్టను అన్నారు కదా శ్రీసాయి. అది అయ్యేంతవరకు ఈ భూమి ఆవరణలో ఉంటాను అని వారు చేసిన చక్కని వాగ్దానం మనకి ఉంది. వారుగా వారే తమకు మృత్యువు లేదని చూపారు (తమ వయస్సు లక్షల సంవత్సరాలు అంటూ...) నిజానికి మృత్యువు లేదని తెలుపటయే ప్రప్రథమంగా నేర్వవలసిన విషయం.




1886లో తాను అల్లా దగ్గరకు వెళుతున్నానని, మూడురోజుల వరకు నిర్జీవమైన తన దేహాన్ని భద్రపరచమని మహల్సాపతికి చెప్పి, దేహత్యాగం చేసి, మూడు రోజుల తర్వాత తిరిగి తన దేహంలో ప్రవేశించి, ఆ తరువాత సుమారు 32 సంవత్సరాలు అదే దేహంతో సంచరించిన శ్రీసాయి కన్నా మృత్యుంజయుడెవ్వరు? బాబా యొక్క మృత్యుంజయత్వం కేవలం తన దేహానికే పరిమితం కాదు. అన్ని విధాల ఆశలు పూర్తిగా వదులుకొని, ఇక జీవించడం అసంభవం అనుకున్న ఎందరో భక్తులను మృత్యుముఖం నుండి బాబా రక్షించారు. మాలన్‌బాయి వంటి వారిని మరణించిన తరువాత కూడా తిరిగి బ్రతికించారు. తమ భక్తులను మృత్యువు నుండి రక్షించే సందర్భాలలో ఏదో అదృశ్యశక్తితో ఘర్షణ పడుతున్నట్టు తిడుతూ, బెదిరిస్తూ, అదిలిస్తూ బాబా చేసిన వింతచర్యలు – తన భక్తుడయిన మార్కండేయుని ప్రాణం రక్షించడానికి ఆ ముక్కంటి మృత్యుదేవతతో పోరాటానికి సిద్ధమయ్యాడని చెప్పే పురాణ కథలను స్మృతికి తేకమానవు. బాబా మృత్యుంజయుడు కనుకనే, "నా సమాధి నుండి కూడా నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాను. నా నామం పలుకుతుంది. నా మట్టి సమాధానమిస్తుంది" అని హామీ ఇచ్చి, ఆ హామీని ఇప్పటికీ తు.చ. తప్పకుండా నెరవేరుస్తున్నారు. అందుకే (శ్రీసాయిభక్తులకు) శ్రీసాయినాథుని కన్నా మృత్యుంజయుడెవ్వరు? సాయినామాన్ని మించిన మృత్యుంజయ మంత్రమేమున్నది? (బాబా ఎక్కడికీ పోలేదు. వారు జీవించే ఉన్నారు. వారు సూక్ష్మ అదృశ్యరూపంలో మార్గదర్శకత్వం వహిస్తూ అన్ని విషయాలలో నాకు సహాయం చేస్తూనే ఉన్నారు. ఇది నాకు అనుభవపూర్వకంగా ఎన్నో విషయాలలో నిదర్శనమయింది. ఉదాహరణకు నేను 1919లో 81 రూపాయల 8 అణాల పెన్షన్‌తో పదవీ విరమణ చేసాను. నేను పదవీ విరమణ చేయడం మంచిదయింది. ఎందుకంటే, వెంటనే నా స్నేహితుని మిల్లులో నెలకు 250 రూ॥ల జీతంతో ఉద్యోగం చేరాను. 1919 నుండి 1930 వరకు నేను ఆ ఉద్యోగంలో ఉన్నాను. ఈ ఏర్పాటంతా బాబానే చేసారు.)

**– సేకరణ : గురుకృప**

నా వారు అనుకున్న వారు,

నా మార్గాన్ని అనుసరిస్తారు, నా పద్ధతులను పాటిస్తారు.

**– శ్రీబాబూజీ**

## భక్తుల సందేహాలు - శ్రీబాబూజీ సమాధానాలు




**భక్తుడు :** గురువుగారూ! మామూలుగా కూడాను అది చిన్నదైనా, పెద్దదైనా మేము చేసే వర్క్‌లో, ప్రతి చిన్న పని రికగ్నిషన్ కోసం చేస్తున్నట్లుగా ఉంటుంది. అంటే ప్రమోషన్ కోసం కానివ్వండి, జీతం కోసం కానివ్వండి, రివ్యూస్ ఉంటాయని కానివ్వండి... ప్రతి ఒక్కరూ కూడా ఐడెంటిటీ కోసం ట్రై చేస్తూ ఉంటారు. అంటే ఆఫీస్‌లో ఉన్నంతసేపూ రికగ్నిషన్ కోసం ఆ మైండ్‌సెట్‌తో ఉంటాము. ఆఫీసు నుంచి బయటకొచ్చిన తరువాత, లైఫ్‌లో జరిగే ఇన్సిడెంట్స్‌లో చూసుకుంటే, మనం ఐడెంటిటీ కోసం ట్రై చేయకూడదు. బాబాతత్త్వంలో, మనం బాబాకు దగ్గరవ్వాలంటే మన ఐడెంటిటీ పోగొట్టుకోవాలి అనుకున్నపుడు అది సమన్వయం కాదు. అసలది ఎలా అడగాలో కూడా నాకు తెలియదు. బ్యాలెన్స్ అనాలా? లేకపోతే రెగ్యులర్ లైఫ్‌లో అది ఎలా ఉండాలి సార్?

**గురువుగారు :** రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవాలి. బాబాకు సంబంధించిన వాటిల్లో ఐడెంటిటీ పోగొట్టుకోవాలి. నువ్వు కంపెనీలో పనిచేస్తుండేటపుడు నిస్వార్థ సేవ చేస్తున్నావా అక్కడేమన్నా? అక్కడికి వెళ్ళింది ఎందుకు? ఉద్యోగం, డబ్బులు, ప్రమోషన్స్... వీటికోసమే కదా! అక్కడికి వెళ్ళి, నేను నిస్వార్థంగా ఉంటాను, రికగ్నిషన్ కోసం పాటుపడను, నాకు పోటీ తత్త్వం లేదు అనంటే ఎట్లా? అది ఉండాల్సిందే. ఇదీ ఉండాల్సిందే. ఈ రెండింటినీ ఒకదానితో ఒకటి కలిపేసుకోకు. అక్కడ నిస్వార్థతా పనికిరాదు. ఇక్కడ స్వార్థతా పనికిరాదు. ఆ రెండింటినీ సరైన పద్ధతిలో బ్యాలెన్స్ చేసుకోగలగాలి.

**భక్తుడు :** గురువుగారూ! డే టు డే లైఫ్‌లో కొన్ని సార్లు కొన్ని విషయాలు చేసేటపుడు తప్పు చేస్తున్నానేమో అనిపిస్తుంది. అవి కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను. మీరు చెప్పినవన్నీ ఓవర్‌కమ్ చేయాలనుకున్నా కొన్నిసార్లు దాన్ని చేయలేక... తప్పు చేస్తున్నాననిపించినా, అది తప్పదని అనిపిస్తుంది ఆ పరిస్థితిలో. మరి దాన్ని ఎట్లా అధిగమించాలి గురువుగారూ!

**గురువుగారు :** ప్రయత్నం చేస్తూ పోవడమే. ఒకసారి తప్పు చేసావనుకున్నపుడు రెండోసారి చెయ్యవు. మూడోసారి చెయ్యవు. ఒకట్రెండుసార్లు చేస్తావు. అంతేగా! లేదా ఒక పని మనం ఫెయిల్ అవుతున్నామంటే ఇంకేదో కారణముంటుంది. దానికి లింక్డ్‌గా వేరే ఏదో ఒక కారణముంటుంది. ఆ కారణంగా ఈ తప్పు చేస్తుంటాము మనం. అది కొంచెం తెలుసుకొని ఆ కారణాన్ని సెట్




చేసుకుంటే ఈ కారణం సెట్ అవుతుంది. ఆలోచిస్తే మనకే తెలుస్తుంది. ఎందుకు చేస్తున్నాము తప్పు అని. కొన్ని తప్పులు మనం అనుకున్నట్లుగా దేనికోసం చేస్తున్నామని అనుకొంటున్నావెూ దానికోసం చెయ్యము. ఇంకేదో కారణం ఉంటుంది. దాని గురించి ఇది చేస్తాం. ఒక ఉదాహరణ చెబితే నేను చెప్తాను.

**భక్తుడు :** అందర్నీ ఇష్టంగా చూసుకోవాలి అనుకుంటాము. కానీ సాటి గురుబంధువుల పట్ల కొన్నిసార్లు ఇంట్లోవాళ్ళతో ఉన్నంత ఇదిగా ఉండలేము. ఆ ఇది రావట్లేదు. కొన్నిసార్లు బాధేస్తుంటుంది. అరే చెయ్యట్లేదే. మనం సరిగ్గా ఉండటం లేదే అని బాధేస్తుంది.

**గురువుగారు :** ఇంట్లోవాళ్ళ లెక్కన ఉండటమెందుకు? ఇంట్లో పర్ఫెక్ట్‌గా ఉంటున్నావా? నువ్వేమన్నా?

**భక్తుడు :** లేదండీ!

**గురువుగారు :** అదేదో పెద్ద ఐడియల్‌లాగా చెప్తావే! ఇంట్లో కంటే బెటర్‌గా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. ఇంట్లో ఎట్లా ఉంటున్నావో నీకు తెలీదూ? నీ ఉద్దేశ్యమేంటి? స్వంత అనే ఫీలింగ్ రావట్లేదు అని. అదేగా నీ ఉద్దేశ్యం? నిజంగా చెప్పాలంటే.. ఎప్పుడూ సత్సంగాలు, వీటిలో ఎప్పుడూ ఇన్వాల్వ్ అయింది తక్కువే, కంపారిటివ్‌గా పోలిస్తే, ఏమయ్యా, తక్కువే కదూ?

**భక్తుడు :** తక్కువే గురువుగారూ!

**గురువుగారు :** తక్కువ కనుకే నీకు ఆ ఫీలింగ్ రావడం లేదు. ఇన్వాల్వ్ అవుతూ ఉంటే వస్తుంది. ఉద్యోగ విషయంగానో లేకపోతే నువ్వుండేటువంటి ప్లేస్ దృష్ట్యానో నువ్వు కొంచెం దూరంగా ఉంటున్నావు. వీళ్ళందరికీ ఉన్న ఇన్వాల్వ్‌మెంట్ నీకు ఇప్పుడిప్పుడే వస్తూ ఉంది. ఇన్వాల్వ్ అవుతూ ఉన్నావంటే అది పోతుంది, ఆ మధ్యలో ఉండే అడ్డు తొలగిపోతుంది. బాబా చెప్పినటువంటి 'అడ్డుగోడ' పోతుంది. నాకు ఇట్లా ఉండాలి, ఇంట్లో వాళ్ళు కాదు, ఫ్యామిలీ కాదు.. ఇదే నా నిజమైన ఫ్యామిలీ అనేటువంటి భావం మనకు లోపల ఉంది, దాన్ని పెంచుకోవడం కోసం ప్రయత్నం చేయాలి. సత్సంగాన్ని ఇల్లు చెయ్యడం కాదు, ఇంటినే సత్సంగం క్రింద మార్చుకోవాలి. దాన్నే 'గృహస్థాశ్రమం' అంటారు. గృహాన్ని కూడా ఆశ్రమంలాగా చెప్తారు. మనమేం చేస్తామంటే ఆశ్రమాన్ని కూడా గృహం క్రింద చూస్తాం. ఆశ్రమగృహమవుతుంది. నెమ్మదిగా చేస్తూ ఉంటే వస్తుంది. అది పొరపాటు ఎందుకవుతుందయ్యా? మనం అనుకున్నటువంటి టార్గెట్‌ని సాధించలేకపోతున్నామనే కదా అర్థం! తప్పు ఎందుకవుతుంది? కాబట్టి మీరిచ్చిన ఎగ్జాంపుల్ కరెక్ట్ ఎగ్జాంపుల్ కాదు.

**భక్తుడు :** గురువుగారూ! ప్రేమ అనేది ఒక్కటే కదా! తల్లిదండ్రుల ప్రేమకి, పిల్లల ప్రేమకి, భార్యాభర్తల ప్రేమకి, గురువుగారి ప్రేమకి డిఫరెన్స్ ఏమైనా ఉందా? అంటే అదేమిటి?




**గురువుగారు :** మిగతావాటి గురించి నీకేమీ అనుమానం లేదు కదా. నీకు వచ్చిన అనుమానమంతా గురువుగారి ప్రేమ గురించే! అదే డిఫరెన్స్. వాటి సంగతి పూర్తిగా నీకు తెలుసు, దీని సంగతి నీకు పూర్తిగా తెలీదు. కాబట్టి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తావు. అంతే!

**భక్తుడు :** నా మనసుకైతే ఒక్క మీ ప్రేమే నాకు స్వచ్ఛమైన ప్రేమగా అనిపిస్తుంది. వేరే దాంట్లో ఏదో స్వార్ధం ఉన్నట్లు అనిపిస్తుంది. నాకనిపించేది నిజమేనా?

**గురువుగారు :** లవ్‌లో ప్యూర్, ఇంప్యూర్ ఏంటయ్యా? ఏం లేదు, అట్లాంటివేమీ ఉండవు. అందరూ వాళ్ళ వాళ్ళ దాని ప్రకారం యాక్ట్ చేస్తారు.

**భక్తుడు :** అంటే తల్లిదండ్రులు నేను కొడుకును కాబట్టి వాళ్ళ నన్ను ప్రేమిస్తున్నారు.

**గురువుగారు :** తప్పేమీ కాదే అది. కరెక్టే కదా, దాంట్లో ఇంప్యూరిటీ ఏముందయ్యా?

**భక్తుడు :** నన్ను ప్రేమించినట్లుగా ఇంక వేరే వాళ్ళను ప్రేమించలేరు కదా గురువుగారూ! మీరు మాత్రం అందరినీ... ఇపుడు శృతిని ఎట్లా ప్రేమిస్తారో అట్లా అందరినీ ప్రేమిస్తారు.

**గురువుగారు :** అది ఎక్కువప్రేమ, తక్కువ ప్రేమ అని అనరు. అది limited, unlimited ప్రేమ. Pure Love, Impure Love అనకూడదు.

తల్లి–తండ్రి ప్రేమ Impure Love కాదది. Limited-Limited to your own, their own children - there is nothing wrong in it, but it is not impure. But it is only confined, it is only limited, whereas Baba's Love is unbounded, unconditional, unlimited. That is the only difference between the love of the Sadguru and the love of a person. But there is no pure or impure in love.

**భక్తుడు :** సార్! ఆహారనియమం, నిద్రానియమం కొన్నాళ్ళు చేస్తున్నా, మళ్ళా అంత ఇదిగా చేయలేకపోతున్నాము.

**గురువుగారు :** దాన్ని ఒక పెద్ద నియమం అనుకోకండయ్యా, అది బాబాకు ఇష్టం ఈ రకంగా




ఉండటం. గురువుగారికి ఇష్టం అని అనుకోండి. సహజంగా వస్తుంది. బిగింపుగా ఎందుకు చెయ్యాలి దాన్ని పెద్ద నియమము అని ఎందుకనుకుంటారు? నియమమని. నిద్రా నియమాల గురించి తెలుసుకోవాలంటే మన శ్రీను ఉన్నాడసలు. ఎన్నో సంవత్సరాల నుండి ప్రాక్టీస్ చేస్తున్నాడు. నిద్రపోతూ మేల్కొంటూ, మేల్కొని నిద్రపోతూ, నిద్రపోయి మేల్కొంటూ...! అట్లా ఉండటం గురువుగారికి ఇష్టం అనుకోండి, మీకు ఆటోమాటిగ్గా పోతుంది. అది ఒక నియమము. అదొక పెద్ద విశేషం అనుకోకండి. పెద్ద విశేషం కాదే. పడుకున్నారు. When you wake up, simply wake up, that's all. Don't go to sleep again. If you remember my words now, you will get up. When you wake up, the first words you remember are these. Then you remember my words, you remember me, and then you get up. That is enough. The body and the mind tell that the sleep is enough. And the next what we sleep is laziness. It's laziness. First it may be somewhat difficult.

Because for us laziness is the best luxury. If you do it two, three times, then you don't even remember, because it's natural. You save so much time, you can do so many things.

**భక్తుడు :** కరెక్ట్ సార్. మీరు చెప్పినదాన్ని బట్టి ఇపుడు ఆలోచిస్తుంటే, మనకు యాక్చువల్‌గా వేరే యాక్టివిటీస్ ఏమీ లేకపోవడం వల్ల, లేచేసి, ఇపుడేం చేస్తాం, చేసేదేమీ లేదులే అని పడుకుంటాము.

**గురువుగారు :** మీరు లేచారంటే ఏదో ఒకటి చేస్తారు. గమ్మున కూర్చునే దానికంటే ఏదో ఒకటి చేద్దాం. ఇదిగో ఇది చేద్దాం. అది చూద్దాం. లేకపోతే ఇది వ్రాద్దాం. ఈ ఎక్స్‌పీరియన్స్ వ్రాద్దాం. అపుడు టైం దొరకదే అనే ఫీలింగ్ ఉండదు.

That's also a Western fad, that busy, no time. Actually, nobody is so busy. Same amounts of work, whether in India or there, that you work. That is a fad. "We're busy, busy, our busy Western Life".

ఎంత టైం సేవ్ అవుతుందో, ఎన్ని useful things చేస్తామో మీరు చూడండి. మన బాడీకెంత ఉపయోగమో హెల్త్ ఇంకా బాగుపడుతుంది. నిజానికి ఎక్కువ నిద్రపోతే హెల్త్ పాడవుతుంది.

**Devotee:** Whenever we cook something, we offer it you, to Baba, and then we eat.

But while cooking we sometimes see whether salt is ok, or Chilli is fine, so we taste. While tasting, we think of Baba, we taste whatever it is that we feel will lack and can we still offer that to Baba?




**Guruji:** That is the final product.

**Devotee:** There is nothing wrong in tasting?

**Guruji:** Nothing wrong in it. Nothing.

**Devotee:** Because for satsang, every time we offer naivedyam to Baba, most people are like thinking, "Oh maybe I should not taste because we haven't offered it to Baba."

**Guruji:** If you think real saburi and then taste. **(ఇంకా వుంది)**

**–శ్రీబాబూజీ అనుగ్రహభాషణాల నుండి**

## ఇదీ కథ

నిజమునకు దర్శించవలసినది ఆ దివ్యచైతన్యమూర్తినే! నీవు కోరినది నా నుండి ఎప్పటికప్పుడు తప్పక పొందగలవు. నీవు దర్శించిన ఆ దివ్యచైతన్యమూర్తిగా ఈ నా సాహచర్యము నీకు ఎల్లవేళలా లభించగలదు. నీవు దర్శించినట్లుగా ఆ చైతన్యమూర్తికి ఈ భౌతికదేహము ఒక వేదిక, ఒక వాహిక, ఒక పీఠము, ఒక ఉపకరణము మాత్రమే! చైతన్యమూర్తి అయిన మానవుడు ఈ దేహమును వినియోగించుకొనవలసి ఉన్నది. అట్లు వినియోగించుకోగలిగినపుడు అతని జన్మకర్మలు దివ్యములు. ఏమరుపాటు చెందినపుడు దేహమును వినియోగించుకోవలసిన మానవుడు దేహమునకు పరిమితమై దానికొరకు బ్రతుకును వెళ్ళదీస్తాడు. ఇది **బ్రతకడం** అవుతుంది. దేహముతో జీవించవలసినది పోయి దేహము కొరకు జీవించే దుర్గతికి లోనవుతాడు. కాలక్రమంలో పెద్దల సాహచర్య భాగ్యం చేత ఈ దుర్గతి నుండి బయటపడుతూ ఉంటాడు. **ఇదీ కథ! బ్రతకడం కాదయ్యా, జీవించాలి అంటారు శ్రీబాబూజీ.** అది ఆర్ట్ ఆఫ్ లివింగ్. జీవించే కళ.

కనుక దివ్యచైతన్యమూర్తిగా నీవు పొందిన దర్శనము నిజమైనది. ఆ చైతన్యమూర్తి నీవు కోరిన రూపులో భాసించగలడు. భాషించగలడు. ప్రస్తుతం నీవు (మనందరం) పొందుచున్న అనుభూతి అదియే!

గురుదర్శన సమయంలో, గురువు కేవలం చూచి ఊరుకోరు. మన మౌనసంభాషణలు




వినిపించుకుంటారు. ఎవరికి తగినట్లు వారితో వారికి మాత్రమే వినబడేటట్లుగా, అర్థమయ్యేటట్లుగా సంభాషిస్తూనే ఉంటారు. ఆ సంభాషణ ఎక్కువ భాగం కన్నుల ద్వారా జరుగుతాయని అందరి అనుభవమే కదా! మనలోని నిశితమైన వెలుగును జ్వలింపచేయడానికే అవి అనేక భంగిమలలో మనలను స్పృశిస్తూ ఉంటాయి. అయితే ఇందులో ఎవరికి తగిన భాష వారికి ఉంటుంది.

ఉత్సవ సమయాలలో అక్కడ చూడటానికి వీలు ఉంటుంది తప్ప, చర్చించడానికి వీలుండదు. అయితే అనుమానాలు తీరడమెలా అని అనిపించవచ్చు. అక్కడ జరిగే వాటిని శ్రద్ధగా చూడగలిగితే చాలు. అందులో ఎవరికి కావలసినది వారికి లభిస్తుంది. ఉత్సవం అంటే కావలసిన అందరికీ కలిపి అందించే సమన్వయం.

**– సేకరణ : గురుకృప**

## క్షణంలో మోక్షం

బాబాకు, మనకు మధ్య సంబంధం ఎలా ఉండాలి అనే దానికి బ్యూటీఫుల్ ఎగ్జాంపుల్ ఒకటి వార్తాలాపంలో ఉంది. నేను ఆ కథను చాలాసార్లు సత్సంగంలో చెప్పాను. ఒకసారి ఓ సాధకుడు, భగవంతుడైన శ్రీమన్నారాయణుని దర్శనం చేసుకోవాలి, ఆయన సాక్షాత్కారాన్ని పొందాలని చెప్పి అడవికి వెళ్ళి ఒక చెట్టు క్రింద కూర్చుని ఘోరంగా తపస్సు చేస్తున్నాడు. మనిషిలో విపరీతమైనటువంటి తపన ఉన్నది. శ్రీమన్నారాయణుని మీద ప్రేమ ఉన్నది. ఘోరంగా తపస్సు చేస్తున్నాడు.

ఒకసారి ఆ దారిలో నారదమహర్షి పోతున్నాడట. పోతూ పోతూ ఈ సాధకుణ్ణి చూసాడు. చూసేసరికి ఆయనకి ముచ్చటేసింది. కుర్రవాడు బాగా శ్రద్ధగా చేసుకుంటున్నాడే అని అనుకొని దగ్గరకెళ్ళి ఏం నాయనా, ఏం చేస్తున్నావు నువ్వు? ఎట్లా చేసుకుంటున్నావు? అని మంచి, చెడ్డా అడిగి తెలుసుకొని, ఆ తరువాత నీకేమన్నా కావాలా చెప్పు అని అడిగాడు. నాకేమీ హెల్ప్ అవసరం లేదు. ఎప్పుడైనా మీరు వైకుంఠానికి వెళ్ళినపుడు ఒక్కసారి ఆ విష్ణుమూర్తిని, నాకు ఎపుడు సాక్షాత్కారం ఇస్తారో, ఆ అపాయింట్‌మెంట్ డేట్... అది కనుక్కొని నాకు చెప్పండి అని అన్నాడు. ఓం దానికేముంది పెద్ద మహాభాగ్యం, చెప్తానులే. బాగా శ్రద్ధగా చేసుకో. బాగా చేసుకుంటున్నావు అని చెప్పి నారదుడు వెళ్ళిపోయాడు. ఆ తరువాత అటూ ఇటూ తిరుగుతూ తిరుగుతూ ఒకరోజున వైకుంఠానికి వెళ్ళి విష్ణుమూర్తితో అదీ, ఇదీ మాట్లాడుతూ అన్నీ రిపోర్టింగ్ చేస్తున్నపుడు జ్ఞాపకం వచ్చింది. ఆం

మర్చిపోయాను స్వామీ, మొన్న దారిలో




వచ్చేటపుడు అక్కడ ఒక చెట్టుక్రింద సాధకుడు కూర్చొని ఉన్నాడు. అతన్ని చూస్తే చాలా ముచ్చటేసింది. పాపం అతడు శ్రద్ధగా చేసుకుంటున్నాడు. అతనికి మీరు ఎపుడు సాక్షాత్కారం ఇస్తారో, ఎపుడు ప్రత్యక్షమవుతారో ఒకసారి చెప్తారా అన్నాడట. దానికి విష్ణుమూర్తి "ఏం చెప్పేది నారదా! పాపం అతడి కర్మ ఎంత ఉందనంటే, అతను కూర్చున్నటువంటి చెట్టుకి ఎన్ని ఆకులున్నాయో, అన్ని జన్మలెత్తిన తర్వాతగానీ నేను అతనికి దర్శనం ఇచ్చేదానికి కుదరదు. అతడి ప్రారబ్ధం అలా ఉంది. అతడి కర్మ అలా ఉంది. నేనేం చేసేది? అన్నారట. అయ్యోపాపం అతడు చాలా దురదృష్టవంతుడే. అన్‌ఫార్చునేట్ ఫెలో, అన్ లక్కీ ఫెలో అనుకొని బయలుదేరి వచ్చేసాడు. ఆ తర్వాత కొంతకాలానికి నారదుడు మళ్ళీ అదే దారిలో వెళుతున్నాడు. అక్కడ ఆ సాధకుడు కూర్చొని ఉన్నాడు. అతడిని చూసేటప్పటికీ జ్ఞాపకం వచ్చింది. అతడికి ఈ దుర్వార్త ఎందుకు చెప్పడమని చూసి చూడనట్టు వెళుతున్నాడు. అతడు అది చూచి, ఏంటి స్వామీ, మొన్న మీకై మీరే వచ్చి పలకరిస్తిరే. ఈసారి చూడకుండానే వెళుతున్నారు. నేనేమన్నా తప్పు చేసానా? అట్లా వెళ్లిపోతున్నారేంటి? అని వెంటపడి అడిగాడు. ఆఁ, ఏం లేదు నాయనా, చక్కగా ఉండు. నేను వేరే అర్జంట్ పనిమీద వెళుతున్నాను. అందుకని నేను చూడలేదు. నేను మళ్ళా వస్తాను అన్నాడు. కాదు కాదు స్వామీ, కాసేపు కూర్చోండి. మీరు వైకుంఠానికి వెళ్ళారా అనడిగాడతను. వెళ్ళాను. ఇపుడు అదంతా ఎందుకు? ఆ విషయాలు అంతా కూడా... అడగకు... చక్కగా చేసుకుంటున్నావు. శ్రద్ధగా చేసుకో, గో అహెడ్ అన్నాడు. అట్లా కాదు స్వామీ, నాకేదయినా చెప్పండి అన్నాడతను. నీకెందుకు, నేను చెప్తున్నాను కదా... చక్కగా శ్రద్ధగా చేసుకుంటున్నావు. హ్యాపీగా చేసుకో పో అన్నాడు. మీరు ఏం చెప్పినా నేనేమీ బాధపడను స్వామీ, ఆయన ఏం చెప్పారో నాకు చెప్పండి అనన్నాడు.

సరే నువ్వింతగా అడుగుతున్నావు కనుక చెప్తున్నాను. ఇదిగో నువ్వు కూర్చున్నటువంటి ఈ చెట్టుకి ఎన్ని ఆకులున్నాయో... కొన్ని లక్షలున్నాయి. అన్ని లక్షల జన్మలు ఎత్తిన తర్వాతగానీ, ఆయన నీకు దర్శనం ఇవ్వరట. ఇప్పుడిప్పుడే నీకేం హోప్ లేదు అన్నాడు. ఆ మాట అనగానే ఆ సాధకుడు ఆనందంతో గెంతడంతో మొదలుపెట్టాడు. కొన్ని లక్షల జన్మల తర్వాతైనా సరే **నాకిస్తానని మాట ఇచ్చారుగా!** విష్ణుమూర్తి నాకెప్పటికైనా దర్శనం ఇస్తానన్నారు. నాకది చాలు. అని ఆనందంతో గెంతుతున్నాడట, నృత్యం చేస్తున్నాడట. వెంటనే అతడికి విష్ణుమూర్తి దర్శనం ఇచ్చారట.




దర్శనం ఇచ్చి ప్రక్కకు వెళ్ళిన తర్వాత నారదుడు, ఏంటి స్వామీ, ఇట్లా నా పరువు తీసిపారేశారే? నేను ఆ సాధకుడికి ఇపుడే చెప్పాను. నీకిప్పుడే దర్శనం లేదని. అతడు నన్నేమనుకుంటాడు చెప్పండసలు? నా ఇజ్జత్ అంతా పోయింది అన్నాడట. అపుడు ఆయన, "నేనేం చేసేది చెప్పు? లెక్క ప్రకారం అయినట్లయితే అతని ప్రారబ్ధానుసారం, కర్మానుసారంగా అన్ని లక్షల జన్మలకే వస్తుంది. కానీ నేను అతనికి ఎప్పటికైనా దర్శనం ఇస్తాను అన్నటువంటి మాట వినడంతో, అతనిలో కలిగినటువంటి **ఆనందోద్రేకమున్నదే, ఆనందాతిశయమున్నదే, ఆ పారవశ్యంలో అతనికుండేటువంటి అన్ని జన్మల కర్మ కాలిపోయింది, మాయమైపోయింది, భస్మమైపోయింది దర్శనం ఇచ్చాను" అన్నారట.**

**బాబా మన కర్మను అట్లా తీసేస్తారా సార్?** ఆ పారవశ్యం ఉంటే. మనకి ఆ పారవశ్యం లేకపోయెనే! ఒకవేళ నెక్స్ట్ ఇయర్ ఇస్తాను అని అన్నా కూడా, మనం ఆః నెక్స్ట్ ఇయరా? నా అంతటివాడు తపస్సు చేస్తుంటే ఇక్కడ. ఏమంత పెద్ద ఇదీ? అనంటాం. అదీ మన దగ్గర ఉండేది. అసలు ఈ పాటికి ఎప్పుడో ఇచ్చి ఉండాల్సింది. అన్ జస్టిస్ ఇది, ఆయనకసలు న్యాయం కాదు అని మనం ఫిర్యాదు చేస్తాం. అతనికి కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత ఇస్తాను అనేటువంటి ఆ మాటతో అంత ఆనందం కలిగింది. **అదీ ప్రేమంటే. అదీ నిష్ఠ, సబూరీ – సంతోషంతో కూడిన ఓరిమి!** ఆ సంతోషంతో కూడిన ఓరిమి నిజంగా మనకుంటే ఆన్ స్పాట్ జరిగిపోతుంది. అంతే. కొన్ని లక్షల సంవత్సరాలు వెయిట్ చెయ్యాలి అనేటువంటి వెయిటింగ్ కూడా అతనికంత ఆనందంగా ఉంది. అవుతుందిగా పని! అదీ **సబూరి** అంటే.

ఒకసారి. ఇపుడు నేను చెప్పినటువంటి కథలో ఉండే ఆ భావంలో, ఎంత భావం మనకు ఆకళింపయ్యింది అని ఆలోచించుకోండి. మనమూ డాన్స్ చేస్తాం. బాబా నాకేం చెయ్యలేదే అని. ఇంకా చేయలేదేంటి, నా అంతటివాడు ఇక్కడ ప్రార్ధన చేస్తుంటే?

ఈ కథ గుర్తుపెట్టుకోండి. ఈ కథ గురించి ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఉంటే ఎన్నెనా మీకు అవగాహనకు వస్తాయి. ఎన్నెనా తెలుస్తాయి. అది నేను ఎక్స్ప్లెయిన్ చేసేదానికంటే మీరు ఆలోచిస్తుంటేనే మీకు తెలుస్తుంది. ఈ స్టోరీని గుర్తుపెట్టుకొని, అప్పుడప్పుడు గుర్తుకు తెచ్చుకొని ఆలోచించుకోండి. రత్నాలు దొరుకుతాయి.




మొత్తం సాధన, భగవంతుని యొక్క అనుగ్రహం, ఆయన ఎప్పుడు సాక్షాత్కారం ఇస్తారు. కర్మ ప్రారబ్ధం... అన్నింటి యొక్క మెకానిజం దాంట్లో ఉంది. అన్నింటికి సంబంధించిన ఆన్సర్స్ దాంట్లో ఉన్నాయి.

**– శ్రీబాబూజీ అనుగ్రహభాషణాల నుండి**

# స్మృత్యంజలి

**20491 రోజుల దివ్యజీవనానికి ముగింపు పలికిన గురుదేవులు (దేవమానవుడు)**

అవతారమూర్తులనే శాసించే చేతనత్వం సాధారణ మానవుడిగా భూమి మీద జీవించడం. అక్టోబర్ 07, 1954న జన్మించిన గురువుగారు (శ్రీబాబూజీ) నవంబర్ 13, 2010న తమ భౌతిక శరీరాన్ని వదిలివేసారు. జీవితాన్ని సాయిమయంగా జీవించిన పూజ్య గురుదేవులు ఆ విషయాన్ని తమ దేహాన్ని ఎక్కడ ఉంచాలో సన్నిహితులకు ఆయన ముందుగానే తెలియచేసారు. బాబా తమ దేహాన్ని బూటీవాడలో ఉంచమన్నట్లుగా. ఇంతకాలం తమ జీవితంలో భాగంగా ఉన్న గురువుగారు ఇక లేరు అనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టంగానే ఉన్నప్పటికీ, సిద్ధ పురుషులు, మహామహిమోపేతులు, అవతారమూర్తి, సద్గురువు అయిన గురువుగారు, తమ భౌతిక శరీరాన్ని వదిలివేయడంలో కూడా సాధారణత్వం. **Simple living... High thinking...** ఇది వారి దేహ పరిత్యాగంలో కూడా వ్యక్తం అయింది.

ఆయన యొక్క చేతనత్వం స్థాయి గురించి కొద్దో గొప్పో అవగాహన ఉంది. అయినప్పటికీ ఆయనకు దూరంగానే ఉండిపోయానే, ఆయనను ఏమీ ఉపయోగించుకోలేకపోయానే అనే బాధ లోపలి నుండి కొంచెం తన్నుకొచ్చింది. "అవతారమూర్తి భూమి మీద తన సాధారణ ప్రయాణంలో కూడా ఎక్కడైనా ఆగి టీ త్రాగితే, అది కూడా ముందుగానే నిర్ణయింపబడి ఉంటుంది" అని రమణులు పేర్కొనేవారు. అందుచేత గురువుగారి జీవిత అవధి 20,491 రోజులు అవడం కాకతాళీయం కాదు అని, ఒక అద్భుతమైన బాబా ప్రణాళిక అని అనిపించింది. అత్యద్భుతమైన బాబా ప్రణాళికలో భాగంగానే ఇటువంటి దివ్య జీవితం భూమి మీద సాకారమై నడయాడినది. ఏదో ఒక రోజు, అటువంటి వ్యక్తిని ఉపయోగించుకోలేకపోయామే అని బాధపడే రోజు వస్తుంది అని ఓ సాధకుడు అన్న మాట. చివరకు ఆ రోజు రానే వచ్చింది. బాబా చరిత్రలో శ్యామా వృత్తాంతం, అరే ఇంతకాలం వారి చెంత నుండి, వారిని దైవంగా చూడలేకపోయానే అని బాధపడతాడు అన్నది

చదువుకున్నా, మనం వివేకంతో మసలుకోలేకపోయామే అన్న ఆలోచన వస్తుంది.




గురువుగారితో ఏ కొన్ని క్షణాలు గడిపినా అది వారి అనుగ్రహమే. మనం అదృష్టం అనుకుంటాం. కానీ గురువుగారు అదృష్టం అంటే 'ఆ' దృష్టి అన్నారు. అయినా మనం ఆ దృష్టితో గ్రహించలేకపోయాం. కనుకనే గురువుగారు చెప్పేవారు "బాబా నా వాడు, నేను బాబా సంబంధీకుడను" అన్న ఒక్కటి గుర్తుంచుకుంటే చాలు అని. నాకు కొన్ని లక్ష్యాలున్నాయి, నాకు కొన్ని ఆదర్శాలున్నాయి. వాటి గురించి నేను పని చేస్తున్నాను. ఆ లక్ష్యాలను నేను మరువలేదు, మరువను! మీరేం చేస్తారు అన్నది మీ ఇష్టం!!

గురువుమీద ప్రేమతో చేస్తే, రేపు గురువుమీద ప్రేమ ఉండకపోతే మానేస్తారు. లక్ష్యాల మీద ప్రేమ ఉంటే గురువుతో సంబంధం లేకుండా చేస్తారు. ఆ చేయడంలో గురువు మీద ప్రేమ వ్యక్తం అవుతుంది. లక్ష్యాలు ఇంపార్టెంట్ కదా! గురువు గుర్తు ఉండడం అంటే గురువు లక్ష్యం, ఆదర్శం గుర్తు ఉండడమేగాని, గురువు అన్న దేహం కాదు. మీరు గురువుని గుర్తించారా, లేదా అన్నది ఇంపార్టెంట్ కాదు ఇక్కడ. గురుదేవుల లక్ష్యాన్ని గుర్తించామా లేదా అన్నది ఇంపార్టెంట్.

*– సంకలనం : గురుకృప*

## బాబాను బాబాగా చూడటం

**భక్తుడు :** బహుశా సార్! మీరు చెప్పేది ప్రతిదీ చాలా సింపుల్‌గా, కామన్ లాంగ్వేజ్‌లో చెప్తుంటారు. కొన్ని కొన్ని లీలలను మేము అర్థం చేసుకోవడంలో కష్టం చేసుకుంటుంటాం సార్, అర్థం కాకపోవడానికి కారణం అది.

**గురువుగారు :** అందుకనే నేను చెప్పేది వేదాంతం కాదని చెప్పింది. **"Vedanta is making simple things Complex"** అని ఎవరో చెప్పారు. **My way is to make complex things Simple.** నిజానికి అవి సింపులే. అవేమీ పెద్దగా లేవక్కడ. కానీ అంత సింపుల్ కూడా కాదు. మన సంక్లిష్టత ఎక్కణ్ణుంచి వస్తుందంటే, అవసరం లేని దగ్గర వివరణలు ఇవ్వడంలో వస్తోంది. బాబా ఇలా కూర్చున్నారు, ఇలా వ్రేలు పెట్టారు, ఇలా వ్రేలు పెట్టేదానికి అర్థమేమిటి? అంత అవసరమా అదేమన్నా? ఎలా కూర్చున్నా, ఆయన బాబా. మనకు ఇంతకు ముందు మనం చదివినటువంటి వేదాంతము,

యోగము, ఈ ముద్రలూ ఇవన్నీ బాగా బుర్రకెక్కి బాబాను కూడా ఆ రకంగా అన్వయం చేయడానికి ప్రయత్నం చేస్తాం. అన్వయం చేసి దాన్ని లైక్ చేయడానికి ప్రయత్నం చేస్తాం. అంతే తప్పితే బాబా మార్గంలోకి మనం పోవడం కాదు. మన మార్గంలోకి బాబాను తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తాం. ఆ ప్రయత్నాలు ఆపడానికే నేను ప్రయత్నం చేస్తాను. బాబాను, బాబాగా చూడండి. ఆయన ఎలా ఉన్నా బాబానే. కూర్చునే దానికి అర్థాలు లేవా? ఉండవచ్చేమో. మనకు అవసరమైతే ఆయన చెప్పరూ! ఆయన చెప్పలేదంటే మనకనవసరమైన విషయం అది. అనవసరమైన విషయాల గురించి మనకెందుకు? బాబా ధుని వేసుకున్నారు. బాబా అగ్నిహోత్రం చేసారు. అది చెప్తే మనకు తృప్తి. అగ్నిహోత్రం ఏం చెయ్యలేదు. ఆయన వైదిక చర్యలేమీ చెయ్యలేదు. వేదంలో అగ్ని పవిత్రం. అగ్నిని పూజ చేస్తారు. బాబా ఏ రోజునా అగ్నిని పూజ చేయలేదు. మంట పైకెక్కితే, "ఏయ్, తగ్గు" అన్నారు. కర్రపెట్టి, ఒక సర్వెంట్‌ను చూసినట్టుగానే, "తగ్గు" అన్నారంటే, కర్రపెట్టి చూపించి, కొట్టినట్టుగానే తగ్గింది. ఆయన మసీదులో రాత్రయితే బయటకు పోయేవారు కాదు. ఎప్పుడన్నా ఆయనకు ఆరోగ్యం బాగాలేక లెట్రిన్‌కి పోవాల్సి వస్తే లెండీ దాకా పోయేవారు కాదు, మసీదులోనే కూర్చునేవారు. ఎక్కడ కూర్చునేవారు? ధుని ప్రక్కన కూర్చొని, ఆ బూడిదలో దాన్ని కప్పేసేవారు. మంటను సరిచేసేటపుడు కాలితో సరిచేసేవారు. ఇది వైదికచర్యా? మనకు అట్లా ఆలోచించడం ఇష్టం ఉండదు. బాబా వైదికుడు అనుకోవడం మనకిష్టం. అందుకని బాబా నిత్యాగ్నిహోత్రి అని చెప్తే అది ఒక తృప్తి. నేనేమంటానంటే, అది కరెక్ట్ కాదు. బాబా అగ్నిహోత్రం చేసినా, చేయకపోయినా, ధుని వేసినా, వేయకపోయినా, బాబా బాబానే ఆయన ఫలానావి చేసారు కనుక, ఫలానా చర్యలు చేసారు కనుక నేనాయనకు పూజ చేయను. బాబా బాబా కనుక చేస్తాను. ఆయన ఏమి చేసినా నాకు సంతోషమే. ఆయన చేసిన ప్రతి ఒక్కటీ నాకు లీలే. అది మన వైఖరిగా ఉండాలి.




***– గురువుగారి సత్సంగభాషణాల నుండి***

**మీరు నన్ను ఎలా చూస్తున్నారు అనేది ముఖ్యం కానీ నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కాదు. నిజానికి నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కూడా ముఖ్యమైనదే, కానీ మీరు దానిని అర్థం చేసుకోలేరు.** **– శ్రీబాబూజీ**




# గురుకృపాలహరి

**యతోవాచో నివర్తంతే ప్రవర్తంతే యతస్తు నః**

**తస్మైకస్మైచి దానంద చంద్రికా మౌళయే నమః**

వాక్కులు ఏ వస్తువు నుండి మరలిపోతాయో, ఏ వస్తువుల నుండి (అనుగ్రహం వల్ల) ప్రసరిస్తాయో అట్టి సచ్చిదానంద చంద్రికను కిరీటంగా ధరించిన ఒకానొక మూర్తికి నమస్కరిస్తున్నాను అంటారు శ్రీకల్లూరి వెంకటసుబ్రహ్మణ్య దీక్షితులు. వీరు పరమాచార్యస్వామి వైభవాన్ని వర్ణిస్తూ వ్రాసిన సంస్కృత కావ్యం "గురుకృపాలహరి". పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ప్రేరణ, విశేషానుగ్రహమే తప్ప, అట్టి "సచ్చిదానంద చంద్రికా కిరీటాన్ని" ధరించిన స్వామివారి జీవిత విశేషాలను పంచుకునే నేపథ్యం లేని వ్యక్తిచే ఈ అక్షరార్చన జరుగుతోంది. పూర్వం కల్లూరి వారిచే రచింపబడిన కావ్యం యొక్క ఎరుక లేకుండానే స్వామివారి జీవిత విశేషాల సంకలనం "గురుకృపాలహరి" అనే రూపం దాల్చింది. ఇది ఎలాంటిదో కల్లూరి వారి మాటల్లోనే ఒక అనుభవంగా చూద్దాం. పై శ్లోకాన్ని కల్లూరి వారు చిదంబరం దగ్గర్లోని ఆనందతాండవపురంలో స్వామివారు శంకరజయంతి సమయంలో విడిది చేసిన సమయంలో చేసిన స్తుతి. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక గురుబంధువు, పండితుడు అయిన వారు తెల్పిన విశేషమేమంటే, అదే ఊరిలో మూడు రోజుల క్రితం శ్రీవారు పిల్లలనందరినీ రామనామాన్ని వందసార్లో, వేయిసార్లో వ్రాసుకొని రమ్మన్నారు. అలా తెచ్చిన పిల్లలకు కామాక్షి బంగారు ముద్రలు ఇచ్చారు. వారిలో ఒక పిల్లవాడు మూగవాడు అయినా వ్రాయగలడు, కనుక వ్రాసి తెచ్చి శ్రీవారి ముందు పెట్టాడు. శ్రీవారు వాడిని చూచి "సొల్లు సొల్లు" చదువు చదువు అన్నారు. వాడు శ్రీరామాయ నమః అని చదివేసాడు. ఇదిగో మీరు స్తుతి చేసిన శ్లోకానికి ఇదిగో ప్రత్యక్ష నిదర్శనం అని చూపించారు. ఇలా, మనందరం గురువును స్తుతి చేసుకునే ఏ సందర్భమైనా అది కేవలం ఆ అనంతమైన అనుగ్రహాన్ని వర్ణించుకోవడానికి ఒక మూగవాని వలే చేసే యత్నమే కానీ మన శక్తి సామర్థ్యాలు కావన్నది సుస్పష్టం. అంతేనా! అదే

గురుకృపాలహరిలో కల్లూరి వారు పంచుకున్న మాట. **"శ్రీమాతా గురుదేవతే త్వహ మయే"**




అంటే గురుదేవులయిన శ్రీవారిని మా అమ్మగా భావిస్తున్నాను అని. పదాలకు పరిమితమైన పదార్థమా ఇది? స్వామి వారి మాతృఛాయ ఎలా ఉంటుందో ఈ క్రింది అనుభవంలో చూద్దామా?

మా అమ్మ దివ్యనిర్యాణం తరువాత కొన్నాళ్ళు నేను తల్లి లేని పిల్లవాడనైనానని అనిపించేది. ఏదో కొరతగా ఉండేది, బిడ్డ కడుపు చూచేది అమ్మగదా! ఒకసారి నేనూ నా ధర్మపత్నీ దక్షిణదేశంలో కొన్నాళ్ళు శ్రీవారిని సేవిస్తూ కూడా తిరిగే భాగ్యం పొందాము. అమ్మ ఒళ్ళో ఉన్నట్లే అనిపించేది. ఒక ఊళ్ళో శ్రీవారు శ్రీత్రిపురసుందరీ కామేశ్వరుల పూజ చేసి, తీర్థానుగ్రహం చేసి భిక్షార్థం లోనికి వెళ్ళారు. మేమిద్దరం సమయం చూచి పిలుస్తారు గదా అని అనుకున్నాము. నాల్గుగంటలయింది. మఠం పరివారం ఎవరూ మా సంగతి చూడలేదు. అపుడు నేనే వంటశాల లోనికి వెళ్ళితిని. వాళ్ళంతా అక్కడ భోజనాలు చేస్తున్నారు. ఆ మధ్యకు వెళ్ళడం ఎందుకని మేమిద్దరం ఆ వేళ ఉపవాసమున్నాము. ఉన్నట్లు మేము ఎవరికీ చెప్పనూ లేదు.

బిడ్డ ఆకలి అమ్మకు తెలుస్తుంది కాబోలు. శ్రీవారి అంతరంగంలో ఇది స్ఫురించింది. మరునాడు మా వెంట నొక పరిచారకుడు ఉంటున్నాడు - మేము ఎక్కడుంటే అక్కడ ఉంటూ మేము ఎక్కడ స్నానం చేస్తున్నామో - ఏమి చేస్తున్నామో కనిపెడుతూనే ఉన్నాడు. మమ్మల్ని భోజనానికి తీసుకొని వెళ్ళాడు. అయ్యాక కూడా మా వెంటనే సంచరిస్తూనే ఉన్నాడు. అపుడు నేను బాబూ! మాతో పాటే ఉన్నారు. మఠ కార్యాల్ని మరి చూచుకోండి అన్నాము. కాదు "పెరియవాళ్-సొల్లిట్టారు" "శ్రీవారు చెప్పారు. మీతో ఉండమన్నారు" అన్నారు ఆయన. మాకు ఆశ్చర్యం వేసింది వెంటనే విషాదం కలిగింది. రాత్రి శ్రీవారి దగ్గరకు వెళ్ళి ఏకాంతంగా సాష్టాంగపడి రాగాలు పెట్టాను. "ప్రభూ! నా తప్పు మన్నించండి. ఈ అనుచరుడు వద్దు. జగజ్జనని త్రిపుర సుందరి ప్రసాదం అని మరచి అందులో "ద్విజభుక్తశేషం విశేషం" అది విస్మరించి నిన్న బ్రాహ్మణులంతా భోజనం చేసారని నేను చేయక ఉపవాసం ఉన్నాను పొరపాటు" అని క్షమార్పణం చెప్పుకున్నాను. అపుడు శ్రీవారు "మఠాధిపతిని గదా! ఎవరు ఎక్కడ ఆకలితో ఉన్నారో చూచే బాధ్యత నాది. మీరు ఉపవాసం ఉంటే ఉపేక్షించడానికి లేదు. మీకు భాష రాదు. పరాయిదేశం - పరివారం కనిపెట్టాలి. వారు ఉపేక్షిస్తే నేను ఉపేక్షించినట్లే. అందుకు ఆ బ్రాహ్మణుని మీ వెంట ఉండి కనిపెట్టమన్నాను" అన్నారు. మహాప్రభో! ఎవరూ వద్దు - మఠ పరిచారకులలో నేనూ ఒకడినే. నేనే నా సంగతి




చూచుకుంటాను. ఎన్నడూ అపచారం చేయను అన్నాను. ఆ మాట విని శ్రీవారిలో వెల్లి విరిసిన కృప – ఆ మాతృవాత్సల్యం, ఆ చూపులో చిందిన అమృత బిందువులు అవి ఆస్వాదించ వలసిందే కదా!

అదే మాతృఛాయలో విరిసిన పీఠాధిపతులు ప్రస్తుత పీఠ జగద్గురువులు అయిన విజయేంద్రసరస్వతీ స్వామివారి యొక్క సన్యాస స్వీకరణను కూడా ఈ సమయంలో గుర్తు చేసుకోవడం సరియైన అంశం. స్వామివారు తమ విజయయాత్రలో ఇంతకు మునుపు సంచికలో పంచుకున్నట్లు కస్తూరిపల్లి, రాఘవేంద్ర సిమెంట్ ప్రాంగణానికి చేరే సమయానికి అప్పటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీయుతులు నందమూరి తారక రామారావు స్వామివారికి స్వాగత సత్కారాలతో ఎదురేగారు. నిజానికి రాష్ట్రప్రభుత్వ లాంఛనాలను స్వీకరించనప్పటికీ, స్వామివారి రాకను పురస్కరించుకొని ముఖ్యమంత్రిగా గౌరవ వందనాలర్పించారు శ్రీరామారావు. కర్నూలులో సూర్యలక్ష్మి కాటన్ మిల్లు ప్రాంగణంలో ఉండగా పదమూడు సంవత్సరాల బాలుడైన శంకర నారాయణన్‌కు, తర్వాత పీఠాధిపతిగా సన్యాసాశ్రమాన్ని స్వీకరించడానికి పరమాచార్యుల ఆశీస్సుల కోసం తోడ్కొని వచ్చారు జయేంద్ర సరస్వతీస్వామి. అలా శ్రీశంకరనారాయణన్ 29 మే, 1983వ సం॥ కాంచీపురంలో సన్యాసదీక్షను స్వీకరించి శ్రీశంకర విజయేంద్రసరస్వతీ అన్న సన్యాస నామధేయంతో 70వ పీఠాధిపతిగా కంచి కామకోటి పీఠ పరంపరలో ప్రస్తుతం కొనసాగుతూ ధార్మిక, ఆధ్యాత్మిక, సేవానిరతిని ప్రజానీకంలో పాదుకొల్పుతున్నారు.

ఆ సంవత్సరం చాతుర్మాస్యం, వ్యాసపూజ సమయానికి పరమాచార్య స్వామివారి చెంతనుండాలని ఇరువురు స్వాములు ఆశించడమూ, మొదట నిరాకరించినా తదుపరి పరమాచార్య స్వామివారు అంగీకరించడమూ జరిగాయి. అలా "బాలపెరియవ"గా పిలువబడే విజయంద్ర సరస్వతీ స్వామివారు 8 జూలై, 1983వ సం॥ పీఠాధిపత్యం స్వీకరించాక కర్నూలు పట్టణం రావడం జరిగింది. ఆ సమయంలో శ్రీఏకాంబరంను స్వామివారు ఇలా అడిగారట "వారి రాకను పురస్కరించుకొని ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నావు?" ఘనమైన ఏర్పాట్లను స్వామివారు మెచ్చరని శ్రీఏకాంబరం "పూర్ణకుంభంతో స్వామివారిని మీ వద్దకు తీసుకువస్తానని" చెప్పగా – పరమాచార్య స్వామివారు "అలా కాదు. పట్టణ ప్రముఖులకు స్వామివారి రాక గురించి కబురు పంపి, పూర్ణకుంభంతో వారికెదురేగి స్వాగతం పలకండి. మల్లెలు జల్లుతూ బాటకిరువైపులా కొబ్బరికాయలు కొట్టండి. పేదలకు కొత్త

ధోవతులను పంచండి. వారే నువ్వు, త్యాగరాజన్ ఇరువురూ కూడా శ్లోకాలను చదువుతూ ఉండండి" అని




ఋగ్వేదంలోని "స్వస్తి" శ్లోకాన్ని చదువుతూ స్వామివారు నా చెంతకు వచ్చే వరకు ఈ తెలియచెప్పారు. ప్రదోషంనాడు బాలస్వామి వస్తారు కనుక, ఈ ప్రాంగణంలో వారికి వసతి ఉండదు కనుక దగ్గర్లోని శివాలయంలో విడిది ఏర్పాటు చేసి నా పూజలయిపోయే సమయానికి వారు వచ్చేట్లు ఏర్పాటు చేయమని పురమాయించారు. స్వామివారు చెప్పింది చెప్పినట్లు పాటించారు అంతేవాసులు. అలానే బాలస్వామి – పరమాచార్యుల చెంతకు రావడమూ, వారిరువురూ ఏకాంతంగా పదిహేను నిమిషాలు ఉన్న తరువాత బాలస్వామి మరలా విడిదికి వెళ్ళడమూ జరిగాయి. బాలస్వామిని తోడ్కొని వచ్చిన వారందరినీ తిరిగి జయేంద్ర సరస్వతీ స్వామివారి వద్దకు వెళ్ళమని, బాలస్వామి రాకను తెలియచేయమని చెప్పారు పరమాచార్య స్వామి.

భక్తుల ఆనందానికి, ప్రజల అవసరానికి స్వామివారి ఆశీస్సుల 'వర్షం' ఆ ప్రాంతాన్ని ముంచేసింది. ఎన్నో సంవత్సరాల అనావృష్టి నుండి తేరుకుని ఆ ప్రాంతం నీటి వనరులతో కళకళలాడింది. బీళుగా ఉన్న పొలాలన్నీ పచ్చటికళను సంతరించుకున్నాయి. భక్తుల వద్దంటున్నా వీరపూర్ అనే ప్రాంతంలో పూర్తిగా ఎండిపోయిన తటాకంలో ఉన్న కొంత నీటితోనే స్వామివారు స్నానం చేసారు. స్వామివారి తర్వాత విడిదిలో అక్కడి ప్రజానీకం తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా నీటికి లోటు లేకుండా సుభిక్షమయ్యిందని విన్నవించడానికి. చాతుర్మాస్యం పూర్తి అయ్యాక భగవద్గీత పారాయణ ముగించి ముువ్వురు స్వాములు కలసి కాంచీపురంవైపుగా తమ అఖండ యాత్రను కొనసాగించారు అక్టోబర్ 31వ తేదీన.

సుమారు రెండునెలల తర్వాత తమిళనాడు, ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో డిసెంబర్ 7వ తేదీ, 1983వ సం॥ చేరుకున్నారు. అక్కడ జి.కె.మూపనార్, ఆర్.ఎమ్.వీరప్పన్ వంటి నాయకులు స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలసి గౌరవంగా స్వాగత సత్కారాలు చేసుకున్నారు. మహాస్వామి వారి గురుదేవులు, పరమ గురువుల సన్నిధానమైన కలవై చేరుకున్నారు. కాంచీపుర సర్వతీర్థం వద్ద జన సామాన్యము, భక్తులు, అధికార, అనధికారులంతా స్వామివార్ల రాకకోసం ఎదురుచూడసాగారు. పూర్ణకుంభ స్వాగతములతో ఏకాంబరేశ్వర దర్శనము, తదుపరి మంటప ప్రాంగణములో స్వస్తివచనాలు, తర్వాత కామాక్షీ అమ్మవారి దర్శనములతో గొప్ప యాత్రగా ఫిబ్రవరి 4వ




తేది, 1984వ సం॥ శ్రీమఠం చేరుకున్నారు ముగ్గురు స్వాములు.

సుమారు 3,860 కి.మీ. స్వామివారి పాదయాత్ర (విజయ), ఆరు సంవత్సరాలు అత్యంత కఠినమైన పరిస్థితుల మధ్య, అతి తక్కువ ఏర్పాట్లు, కేవలం ఐదుగురు అంతేవాసులతో కాంచీపురం తిరిగి చేరింది. కంచి పీఠ పరంపరలో ఎందరో గురుచంద్రులు వారి వారి ఆశ్రమ ప్రాంగణాలకు తిరిగి రాకుండానే ధర్మపరిరక్షణా ధురీణతతో యాత్రలను నిర్వర్తిస్తూ తమ దేహాలను త్యజించడం జరిగింది. ధర్మాన్ని సాధించడానికి, ధర్మాన్ని ప్రజలలో పాదుకొల్పడానికి దేహాన్ని ఒక సాధనంగా మాత్రమే భావించిన మహితాత్ములు వారు. పరమాచార్య స్వామివారు మరలా ఈ ప్రాంగణానికి తిరిగి వస్తారా, లేక స్వామివారికి దూరంగానే తాము ఉండవలసి వస్తుందా? అన్న చింత కంచి ప్రజానీకాన్ని కలవరపాటుకు గురి చేసింది. భగవదనుగ్రహం – స్వామివారు మరలా మఠ ప్రాంగణానికి వేంచేయడం వారిని సంతోషసంద్రంలో ముంచింది. అది ఎంత గొప్పగా జరిగిందంటే స్వామివారి రాకలో  ప్రభుత్వ లాంఛనాలను వ్యతిరేకిస్తున్న ఏ ఒక్కరినీ ప్రభుత్వం పట్టించుకోలేదంటే ప్రజల్లో స్వామివారిపట్ల నెలకొన్న భక్తిభావం ఎంతటిదో స్పష్టమవుతుంది. 1984 నుండి 1993 వ సం॥ ఒక విధంగా స్వర్ణ సమయమని చెప్పుకోవాలి. ఓ వంక తమ ప్రౌఢ వయస్సు మీద పడుతున్నా, స్వామివారు మాత్రం తమ కఠిన నియమాలను ఉపసంహరించుకోలేదు. ఎందరో దేశ, విదేశాల ప్రముఖులు, రాజనీతిజ్ఞులు, పీఠాధిపతులు, ప్రజలు, భక్తులు, ఇతర మతాల వరిష్టులు స్వామివారిని దర్శించి ఆశీస్సులను పొందారు. ఇదే సమయంలో స్వామివారు ఎన్నో మానవతా సహాయ కార్యక్రమాలకు, వేదపరిరక్షణకు, సనాతన ధర్మరక్షణకు ఎన్నో నూతన కార్యక్రమాలకు ఇరువురు స్వాములకు దిశానిర్దేశం చేసారు. **– గురుకృప**

**భక్తుడు :** ప్రేమ ఎంత ఎక్కువ ఉంటే అంత గ్రేస్, బ్లెస్సింగ్స్, ఎక్స్‌పీరియన్స్ వస్తాయా, గురువుగారూ?

**గురువుగారు :** ఏం లేదు. ప్రేమ ఎక్కువున్నా, తక్కువున్నా... దానికి, దీనికీ ఏం సంబంధం లేదు. ప్రేమ ఎక్కువుంటే నువ్వు అనుభవిస్తావు ఎక్కువ. గ్రేస్ క్వాంటిటీలో ఏమీ తేడా రాదు. ప్రేమ ఉన్నా, లేకపోయినా నీ మీద ఉండే గ్రేస్ అట్లాగే ఉంటుంది, కానీ నువ్వు ఉపయోగపెట్టుకోవు. ప్రేమ ఉంటే ఉపయోగపెట్టుకుంటారు. ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. **– శ్రీబాబూజీ**




# నన్నే తప్పిద్దామనా!

ప్రతి సంవత్సరం జనవరి 11, 12, 13 తేదీలలో నిర్వహింపబడే గురుపూజా మహోత్సవాలలో మాస్టరుగారు క్రమంగా కొన్ని నియమాలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. ఆ సంవత్సరానికా సంవత్సరం పెరుగుతూ వస్తూన్న సోదర బృందం సంఖ్యనుబట్టి సోదర బృందానికి ఆయన ఈయదలచిన శిక్షణను బట్టి ఈ నియమాలు రూపు ధరిస్తూ ఉండేవి.

ఒక సంవత్సరం **"అతిథులు లేరు – అందరూ సేవకులే"** అని వ్రాయించి ప్రవేశద్వారం దగ్గర కట్టించారు. మరో సంవత్సరం కొందరే ఎప్పుడూ పనిచేస్తూ ఉండటం, కొందరేమో ఎప్పుడూ విశ్రాంతి పేరిట నిర్లక్ష్యంగా తిరుగుతూ ఉండటం గమనించి ఆ పని చేస్తున్న వారిని ఆడపెళ్ళివారుగా, తాము పని చేయకుండా తోటి సోదర బృందంచే పని చేయించుకుంటున్న వారిని మగపెళ్ళి వారుగా పోల్చి సరసమాడుతూనే మందలించారు. ఈ మగపెళ్ళివారు కూడా ఒళ్ళు వంచి పనిచేయడంలోని సౌలభ్యాన్ని, సంతృప్తినీ గమనించుకొని వచ్చే సంవత్సరానికి ఆడపెళ్ళివారుగా రూపొందగలరని ఆకాంక్షిస్తున్నాను అంటూ సరసమైన ఆశీర్వచనం చేసారు.

మరొక గురుపూజల నాటికి భోజనశాలకు సంబంధించి ఒక నియమం పెట్టారు. భోజనం పూర్తవగానే ఎవరి విస్తరివారు స్వయంగా  తీసివేయాలన్నది ఆ నియమం. కార్యకర్తలను ఈ నియమపాలన విషయమై శ్రద్ధగా ఆదేశించారు. ఆ గురుపూజల్లోనే రెండవరోజు మాస్టరుగారు సోదరబృందంతో కలిసి కూర్చుని భోంచేస్తున్నారు. వడ్డనల వారు వడ్డనలు చేస్తున్నారు. ఒకామె మాత్రం కొంచెం దూరాన నిలబడి మాస్టరుగారి వైపు చూపులను నిలబెట్టి చూస్తున్నది. ప్రక్కవాళ్ళతో ఇలా కబుర్లాడుతూనే అలా భోజనాన్ని పూర్తిచేస్తారు మాస్టరుగారు.

పూర్తి చేసి విస్తరి మడత పెట్టబోతున్నారాయన. ఇంతలో ఆ దూరాన నిలబడి చూస్తున్న ఆమె ఒక్క ఉదుటన వచ్చి విస్తరిపైన వాలింది. ఆమె అందుకనే కాచుకొని, నుంచుంది కాబోలు. పనులన్నీ ఆపి ఈ పనికోసమే ఆమె నిలుచుందని అప్పుడు తెలిసింది. "ఆగండి! మాస్టరుగారూ! మీరాగండి! మీరు తీయడమేమిటి? మేమందరం లేమూ!" అంటూ మాస్టరుగారి చేతిలోని మడత పెట్టబడిన

విస్తరిని లాక్కోబోయిందామె. 

మాస్టరుగారు తన విస్తరిని మరి కాస్త గట్టిగా పట్టుకొని చిరునవ్వుతో చిరుకోపాన్ని మేళవించి “ఊఁ తప్పు అడ్డుపడకూడదు. నీ ఉద్దేశ్యమేమిటి? నన్నే నియమాన్నుండి తప్పిద్దామనా? మంచి శిష్యురాలివే”. ఆమె కొంచెం బిత్తరపోయింది. అంత చనువుతో వచ్చిన ఆమెకు ఎంత భయం వేస్తోందో ఆమె ముఖమే చెబుతుంది. విస్తరిని చేత్తో ఒడుపుగా పట్టుకొని రెండవ చేత్తో మంచినీళ్ళ గ్లాసునందుకుంటూ ఇంకా ఇలా అన్నారు మాస్టరుగారు. “ఏమన్నావు నువ్వు. మీరు తీయకండి మేమందరం ఉండగా మీరు తీయడమేమిటి అని అన్నావు అంతేనా? మీరందరూ శ్రద్ధగా నియమాన్ని పాటించాలి అంటే ముందా నియమాన్ని నేను పాటించాలి కదా! అందుకే నువ్వెంత బ్రతిమాలినా నేనంగీకరించలేదు.”

మరి కొంచెం నవ్వుతూ “నీ ప్రయత్నం ఫలించలేదు కదూ! నన్నే నియమం నుండి తప్పిస్తే ఇక మీరందరూ యథేచ్ఛగా ప్రవర్తించవచ్చును కదా? ఏమంటావ్. అంతేనా నీ ఉద్దేశ్యం”. కాదు అన్నట్లుగా దీనంగా చూస్తూ తలను అడ్డంగా ఊపిందామె. పరిస్థితిని గ్రహించిన మాస్టరుగారు అనునయంగా చూస్తూ “పిచ్చిదానా! ఒకవేళ నీకా ఉద్దేశ్యం లేకపోయినా ఫలితం నేను చెప్పిందే జరుగుతుంది. అందుకనే నిన్ను కొంచెం గట్టిగా వారించవలసి వచ్చింది. నేను మీ ఇంటికొస్తాను. అప్పుడు నీ మనస్సుకు తృప్తి కలిగేటట్లుగా విస్తరి తీసేద్దువుగాని, ఇక్కడ మాత్రం ఇలా సాగనీ” అంటూ ముందుకు సాగారు. అదో విధమైన అనుభూతిలో అటువైపే చూస్తూ అలానే నిలబడిపోయి ఉంది ఆమె కొంతసేపు.

**– ‘సరసాల్లో నవరసాలు’ నుండి**

**విశేషంగా వర్ణించే...**
**గుర్వానుగ్రహ ధార...**
**మనలో నిలిచేందుకు...**
**వీలుగా...వాలుగా...**
**మన మనస్సు పల్లం చేసుకునే...**
**వేదిక...వేడుక...ఆరాధనోత్సవం ...**

**– శేఖర్, చెన్నై**




## జాగ్రత్త - బాధ్యత


భక్తుడు : మీరు, మీకెవరూ శిష్యులు లేరంటారు, కానీ వాళ్ళేమో మీ శిష్యులం అంటున్నారు.

గురువుగారు : వాళ్ళు అలా అంటే అనవచ్చు. ఎందుకంటే వారి మనస్సులోని భావాన్ని అలా వ్యక్తం చేయడం వారికి అవసరం కావచ్చు. వాళ్ళతో వద్దు అని చెప్పడానికి నేనెవరిని? వాళ్ళు ఏం చెప్పాలనుకుంటున్నారో దాన్ని చెప్పడం వాళ్ళ హక్కు. కొంతమంది నేను మోసగాడినని చెప్పవచ్చు. అటువంటి వాళ్ళకూ అలా చెప్పే స్వేచ్ఛ ఉంది. వాళ్ళ అభిప్రాయాలు వాళ్ళకుండవచ్చు. నన్ను విమర్శించడం వాళ్ళ అవసరమైతే, వాళ్ళను అలానే చెయ్యనివ్వండి. నన్ను పూజించడం కొంతమందికి అవసరమైతే వారినీ అలా చెయ్యనివ్వండి. వాళ్ళ భక్తిని నేను నా అవసరానికి వాడుకోనంతవరకు, వారి భక్తి వారిలోని ఒక అవసరాన్ని తీరుస్తున్నంత వరకు, నేను చేసేది కేవలం పంచుకోవడం మాత్రమే. ఇది జబ్బుతో ఉన్న వ్యక్తికి మందివ్వడం లాంటిది.

నేను వాళ్ళ వద్ద నుండి విరాళాలు తీసుకుని, ఆశ్రమం కట్టడం మొదలుపెడితేనో, లేక వారి వద్ద నుండి కానుకలు స్వీకరిస్తేనో నా పట్ల వారికున్న భక్తిని నేను వాడుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకనే నేను, నాకు ఎటువంటి ఆస్తిపాస్తులు లేకుండా ఉండాలని, ఎవ్వరివద్ద నుండి ఎటువంటి కానుకలూ విరాళాలూ తీసుకోకూడదని ఖచ్చితమైన నియమం పెట్టుకున్నాను. ఎప్పుడైతే అందరూ మనల్ని పూజించాలనుకుంటారో, అపుడు మనం నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. అందుకనే నేను చాలా జాగ్రత్తగా ఉంటాను. - శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ

బాబా ప్రతి లీలలో మనకు చెప్పిందేమిటంటే, అన్ని జీవుల్లోనూ తానే ఉన్నారు. అంతటా తానే ఉన్నారు. ప్రతి లీలలోనూ ఇదే, ఆ మడత మీదనే ఇస్త్రీ చేస్తూ ఉన్నారాయన. "అన్ని జీవుల్లో ఉండేటువంటిది నేనేనూ" అని చెప్తూ ఉన్నారాయన.

**- శ్రీబాబూజీ**



## సర్వాంతర్యామికి సమర్పణ

ఒక్కమాట! మా గురుదేవుల మాట మాకు బాట! ఆ మాట ప్రకారం నడుచుకొన్నంత కాలము తృప్తిగా సాగిపోవలసిన వారమే! మాకు బాబా సుదర్శనము కూడా వారి ద్వారా లభించినదే! వారి వలన లభించినదే! వారిలో లభించినదే! మా అనుభవంలో మా గురుదేవులు బాబా కన్నా భిన్నం కారు. వారు చెప్పినదే మాకు ప్రమాణము. వారి మాటకు కట్టుబడి మేము నడవాలన్నది మా ధ్యేయం అన్నది మాత్రం ఎవ్వరూ కాదనలేని అంశం. గురువుగారి సాన్నిధ్యమును పొందుటకై చేయుచున్న ప్రయత్నములే సత్సంగం, సద్గ్రంథపఠనం, నామస్మరణ ఇత్యాదులన్నీనూ! ఎవరిని ఏ రీతిగా సముదాయించవలెనో, సమాధాన పరచవలెనో, తీర్చిదిద్ది నిలుపవలయునో గురువుగారికి బాగుగా తెలియును. సకల ప్రయత్నములు, సర్వాంతర్యామి అయిన గురువుగారి యందు సంగమము చెందగలవు.

మనం కోరింది కాదు, మనకు తోచింది కాదు, మనకు నిజంగా ఏది కావాలో అది ఇస్తారు అన్న ఆలోచన దాకా, అవగాహన దాకా, అవసరం దాకా వెళ్ళగలగాలి గురుదేవుల సాంగత్యంలో...

- గురుకృప



"నా జీవితం ఒక పాత్ర అనుకుంటే ఆ పాత్రలో ఏముందో రమణ
మహర్షి చూపారు. దానిని పూండీ స్వామి శుభ్రపరిచారు.
సాయిబాబా దానిని సంపూర్ణంగా నింపారు"

– శ్రీబాబూజీ

సాయిపథగాములపై గురుదేవుల అనుగ్రహా ఇంద్రధనస్సులు..
పూర్ణావధూత సాయి రమణుల మహోన్నత ప్రేమాశీస్సులు..
మా గురుదేవులను, వారు నిర్దేశించిన లక్ష్యాన్నీ
అనవరతం గుర్తుచేస్తుండే సమాధాన సన్నిధానాలు..
బిడ్డలుగా మమ్మ అక్కున చేర్చుకునే ఆనందధామాలు..

..గురుకృప..

gurukrupa.info +91 83672 00045